జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 25 | మే | 2026 ◆ పేజీలు : 6

# ప్రకృతి సేవలతో ప్రశంసలు అందుకున్న చిన్నారి నైనిక

- జర్నలిస్టుల మహాసభలో హరిత సందేశం
- మొక్కలు అందజేసి ఆకట్టుకున్న చిన్నారి



కొత్తగూడెం, మే 24 ( ప్రజాజ్యోతి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 3వ మహాసభలో ప్రకృతి పరిరక్షణపై తనకున్న

మిగతా 2 లో...




# పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సన్ ఫ్లవర్ కొనుగోలును వెంటనే ఏర్పాటు చేయాలి

కొత్తగూడెం కలెక్టరేట్, మే 24,(ప్రజా జ్యోతి) పంట అవశేషాలను కాల్చకుండా ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ పాల్గొన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా సమర్థవంతంగా నిర్వహించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు .ఇటీవల మంత్రి వర్గం సన్ ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్ లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో

మిగతా 2 లో...

# రైతుల భూముల చుట్టూ అక్రమ ప్రహరీ..?



- దశాబ్దాల నాటి రోడ్డు మార్గాన్ని మూసేస్తున్నారంటూ రైతుల ఆవేదన
- జిల్లా కలెక్టర్ స్పందించకుంటే రోడ్డున పడతామని రైతు కుటుంబాల హెచ్చరిక
- భూ సర్వే నిర్వహిస్తే అసలు నిజాలు బయటపడతాయని రైతుల డిమాండ్
- రైతుల సాగు భూములకు వెళ్లే దారిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలు
- ప్రహరీ నిర్మాణంపై ఉద్రిక్తత.. రంగంలోకి పోలీసు శాఖ

లక్ష్మీదేవిపల్లి, మే 24 ( ప్రజాజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హమాలీ కాలనీ, సంజయ్ నగర్ గ్రామ పంచాయతీలకు చెందిన రైతుల సాగు భూముల చుట్టూ రోడ్డు మార్గాన్ని కబ్జా చేస్తూ అక్రమంగా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానిక రైతులు

మిగతా 2 లో...

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్, మే 24,(ప్రజా జ్యోతి) నేడు కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# కన్నతల్లినే కామంతో చూసే కాలమా ఇది...?

6 లో...

- మత్తు మాయలో కన్న తల్లిపై అమానుష వేధింపులు
- "అమ్మ" అనే పవిత్ర బంధానికే మచ్చ
- పాల్వంచ ఘటనతో ఉలిక్కిపడ్డ సమాజం



ఒకప్పుడు "అమ్మ" అనే మాట వినగానే తలవంచే సంస్కృతి... ఇప్పుడు అదే తల్లిని భయంతో వణికించే స్థితికి కొందరు యువకులు దిగజారుతున్నారా...? గంజాయి మత్తు యువత రక్తంలో కలిసిపోతూ... బంధాలు, విలువలు, సంస్కారం అన్నింటినీ కాల్చేస్తోందా...?భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో వెలుగులోకి వచ్చిన ఓ జుగుప్సాకర ఘటన ఇప్పుడు ప్రతి ఇంట్లో చర్చనీయాంశమవుతోంది. "మత్తు వచ్చినవాడికి తల్లి కూడా కనిపించదు" అనే పెద్దల మాటను అక్షరాలా నిజం చేసినట్టుగా చెబుతున్న ఈ సంఘటన... సమాజాన్ని కలవరపెడుతోంది. కన్నతల్లి ఒడిలో పెరిగిన కొడుకే... అదే తల్లిని అసభ్యంగా వేధించాడన్న ఆరోపణలు స్థానికులను కుదిపేశాయి. "చెట్టు వేరు కుళ్లితే కొమ్మలు నిలవవు... యువత మత్తుకు బానిసైతే సమాజం నిలవదు" అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్తు మాయలో మానవత్వమే మంటల్లో కలిసిపోతున్న పాల్వంచ ఘటనపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (భూక్యా రంజిత్ నాయక్), ప్రజా జ్యోతి :

## ప్రకృతి సేవలతో ప్రశంసలు అందుకున్న చిన్నారి నైనిక

(మొదటి పేజీ తరువాయి...)
అభిరుచిని చాటుతూ చిన్నారి నైనిక రజువా అందరి ప్రశంసలు అందుకుంది. ఆదివారం కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించిన మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి కే రామ్నారాయణలకు చిన్నారి నైనిక మొక్కలను అందజేసి హరిత సందేశాన్ని చాటింది. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ప్రకృతి సేవల దిశగా ముందుకు సాగుతున్న నైనికను సభలోని నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మొక్కలు నాటాలని సమాజానికి సందేశం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ చిన్నారులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం సమాజానికి ఆదర్శమని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం చిన్నారి నైనిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేటి తరానికి ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని అలాంటి సందేశాన్ని చిన్నారులు ముందుండి ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకుడు వెంకటరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బీవీ రమణారెడ్డి, మోబకాపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ అత్యంత కీలకమని, పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా మారిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలో టామ్ టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు పంట అవశేషాలను కాల్చవద్దని విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కూడా ఎవరైనా పంట అవశేషాలను కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని



సూచించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీలు, రవాణా వంటి సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రివర్గం సన్ ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, వరి కొయ్యలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐడిఓసి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మహిళా సంక్షేమ వారోత్సవాలను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫిడెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, డిసిఓ శ్రీనివాస్, డిసిఎస్ఓ ప్రేమ్ కుమార్, మెప్మా పీడీ రాజేష్, ఆర్టీసీ డిఎం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడిగా జాగు వెంకట రత్నం, ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్ ఏకగ్రీవ ఎన్నిక
- సంక్షేమం కోసం రాజీలేని పోరాటం కొనసాగుతుంది
- వృత్తికి కళంకం తెచ్చే కలుపు మొక్కలను దూరం చేయాలి
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి రాం నాయరాయణ









కొత్తగూడెం, మే 24 (ప్రజాజ్యోతి) జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిరంతరం పోరాటాలు సాగిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 3వ మహాసభ ఆదివారం కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పులసుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో మృతి చెందిన జర్నలిస్టుల జ్ఞాపకార్థం మౌనం పాటించారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ... 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన యూనియన్ లో సభ్యులుగా ఉండటం గర్వకారణమన్నారు. ఆవిర్భావం నుంచి నేటి వరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికే సంఘం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో బలమైన జర్నలిస్టు సంఘంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిలిచిందని, దేశంలోనే అగ్రగామి సంఘంగా ఎదుగుతోందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, ఆరోగ్య కార్డుల కోసం ప్రభుత్వాల దృష్టికి నిరంతరం సమస్యలను తీసుకెళ్తున్నామని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 47 వేలకుపైగా అక్రిడేషన్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై సానుకూల దృక్పథంతో ఉన్నారని చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిజం వృత్తి ఎంతో పవిత్రమైందని అయితే కొందరి చర్యల వల్ల వృత్తి ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తికి కళంకం తెచ్చే కలుపు మొక్కలను గుర్తించి దూరం చేయాలని పిలుపునిచ్చారు. నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు సమాజంలో గౌరవం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు.

### నిజాన్ని నిర్భయంగా వెలికితీయాలి



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కే. రామ్నారాయణ మాట్లాడుతూ... జర్నలిజం కత్తిమీద సాములాంటి వృత్తి అయినప్పటికీ నిజాన్ని నిర్భయంగా వెలికితీయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా మీడియా నిలుస్తోందని జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ తొలినాళ్ల నుంచి రాజీలేని పోరాటం సాగిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత కూడా జర్నలిస్టుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని అందుకే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహించామని గుర్తుచేశారు. అనంతరం ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సమస్యలను వివరించామని తెలిపారు. జిల్లా నూతన కమిటీ ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని సూచించారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకుని జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

### జిల్లా అధ్యక్షుడిగా జాగు వెంకట రత్నం ఎన్నిక

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడిగా జాగు వెంకట రత్నం, ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్, కోశాధికారిగా శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ విలేకరుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశాలు, శిక్షణ సెమినార్లు నిర్వహించి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకులు విరహత్ అలీ, కే రామ్నారాయణ, జర్నలిస్టు నాయకులు వేణు, వెంకట్రావు, ఏనుగు వెంకటేశ్వరరావు, బి. వి రెడ్డి, శ్రీనివాస్ తో పాటు జిల్లా జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని కూడా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్ నవీన్, ప్రధాన కార్యదర్శిగా జి నాగచంద్ర, కోశాధికారిగా ఎన్ రాజేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రభుదాస్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా టి రవికుమార్, శ్రీహరితో పాటు మరో 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# రామాలయంలో కిక్కిరిసిన భక్తులు

- మండుటెండని సైతం లెక్కచేయని భక్తులు
- ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన దేవస్థానం అధికారులు
- క్యూలైన్‌లో రామయ్య దర్శనం కోసం భక్తులు ఎదురుచూపులు
- వేసవి సెలవులతో భక్తుల రద్దీ





**భద్రాచలం టౌన్, మే 24 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఒక వైపు వేసవి ఉష్ణోగ్రత 42 నుంచి 45 డిగ్రీల మధ్య ఉన్నా రామ భక్తులు రామయ్య దర్శనం కోసం వేచి ఉన్నారు. శనివారం సాయంత్రంకే భక్తులు భద్రాచలం చేరుకోవడంతో దేవస్థానం సత్రాలు, కాటేజీలతో పాటు ప్రయవేటు లాడ్జీలు, వసతి గృహాలు సైతం భక్తులతో నిండిపోయాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తుల రద్దీ విపరీతంగా ఉండటం, వేసవి వేడి కారణంగా రామాలయంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేసి భక్తులకు నేరుగా స్వామి వారి దర్శనం, శీఘ్రదర్శనం కల్పించారు. రామయ్య దర్శనానికి కనీసం 3 నుంచి 4 గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. అలాగే భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. వేసవి తాపాన్ని ఎదుర్కొనేందుకు క్యూలైన్ల వద్ద భారీ ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. మిథిలా ప్రాంగణం చుట్టూ యాత్రికుల బస్సులు, కార్లతో రామాలయం పరిసర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి.

**వైభవంగా భద్రాద్రి రామయ్య కల్యాణం**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత స్వామి వారిని మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చారు. అనంతరం కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు వేదాశీర్వచనం నిర్వహించారు. కళ్యాణం పూర్తయిన తర్వాత కళ్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు కల్యాణంలో పాల్గొన్న వారికి అందజేశారు. అదేవిధంగా ఆదివారం సందర్భంగా అంతరాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.

## హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం





**భద్రాచలం టౌన్, మే 24 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపు ఆదివారం ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరంను భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, హెచ్‌సీఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణతో వారు ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చడమే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత యువత ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపులో కోచ్‌లుగా కుప్పాల చరణ్ తేజ, రవితేజ, శ్రీకాంత్ శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ



**మణుగూరు, మే 24 (ప్రజాజ్యోతి) :** మండల పరిధిలోని కూనవరం గ్రామ పంచాయతీలో భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎండ తీవ్రతను అదేవిధంగా రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ఆశా వర్కర్లకు, బీఎల్‌ఓలకు సొసైటీ ప్రతినిధులు ఉచితంగా గొడుగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి కూనవరం గ్రామ సర్పంచ్ ఏనిక శ్వేత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో నిరంతరం సేవలు అందించే ఆశా వర్కర్ల, బీఎల్‌ఓల ఆరోగ్యాన్ని కాపాడటం, వారికి సౌకర్యాలు అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన భరోసా వెల్ఫేర్ సొసైటీని ఆమె అభినందించారు. విశిష్ట అతిథి యాక్టింగ్ సేఫ్టీ ఆఫీసర్ వరుణ్ మాట్లాడుతూ... ఎండనక వాననక విధులు నిర్వహించే సిబ్బందికి ఈ గొడుగులు ఎంతో ఉపయోగపడతాయని, సామాజిక సేవలలో భరోసా సొసైటీ ముందుండటం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం భరోసా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మహమ్మద్ అమీనుద్దీన్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కష్టపడే వర్కర్లకు చిరు సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా సొసైటీ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్వరూపారాణి వ్యాఖ్యాతగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఉప సర్పంచ్ బన్ను, వార్డ్ మెంబర్లు, లీల, ఉపేందర్, యాకూబ్, రవి, జహీర్, ఆశా వర్కర్లు, బీఎల్‌ఓలు, భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గొడుగులు అందుకున్న లబ్ధిదారులు సొసైటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేతాజీలో అధునాతన వైద్య విప్లవం

- సబ్‌వ్యాస్టస్ పద్ధతిలో మోకాళ్ల కీళ్ల మార్పిడి
- భద్రాచలంలో ఏజెన్సీలో తొలి కేసు విజయవంతం
- దూర, ఆర్థికభారం తగ్గిందంటూ రోగి బంధువులు వేడుకోలు



**భద్రాచలం, మే 24, ప్రజా జ్యోతి:** ఆధునిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా నేతాజీ హాస్పిటల్ మరో కీలక అడుగు వేసింది. అత్యాధునిక సబ్‌వ్యాస్టస్ పద్ధతిలో మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో తొలి కేసుగా గుర్తింపు పొందింది. వరంగల్‌కు చెందిన కృష్ణకుమారీ మోకాళ్ల కీళ్ల అరుగుదలతో గత కొద్దేండ్లుగా తీవ్రం గా ఇబ్బందులు పడుతున్నారు. హైద్రాబాద్, విజయవాడ తదితర పట్టణాలోన్ని కార్పోరేట్ హాస్పటల్స్‌కు వెళ్లినా పూర్తి మోకాళ్ల కీళ్ల మార్పిడికి అధిక ఫీజును చెప్పారు. దీంతో భద్రాచలంలో ఉండే తన కూతురు ద్వారా నేతాజీ హాస్పటల్‌లో వైద్యం అందిస్తున్న తీరును తెలుసుకొని, భద్రాచలంలో సర్జరీ చేయించుకున్నారు. హాస్పటల్ వైద్య బృందం సర్జరీను విజయవంతంగా పూర్తి చేసి, ఆమెను త్వరగా కోలుకొని నడిచే విధంగా చేయటంతో ఆమె హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక విధానంలో సంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే కండరాలపై తక్కువ ప్రభావం ఉండటంతో రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం నొప్పి తక్కువగా ఉండడం, త్వరితగతిన నడవగలగడం, కోలుకునే సమయం తగ్గడం వంటి ప్రయోజనాలు ఈ విధానంలో ఉన్నాయని పేర్కొన్నారు. నేతాజీ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. హేమంత్ కాకర్ల మాట్లాడుతూ... ఇటువంటి చికిత్స పద్దతిలో భద్రాచలం ఏజెన్సీలోనే కేసును పూర్తి చేయటం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ‘‘సబ్‌వ్యాస్టస్ పద్ధతి ద్వారా మోకాళ్ల కీళ్ల మార్పిడి చేసినప్పుడు రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. తక్కువ నొప్పి, వేగంగా నడక ప్రారంభించడం వంటి ప్రయోజనాలు ఉంటాయి’ అని పేర్కొన్నారు. హాస్పటల్ మేనేజ్‌మెంట్ జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎం నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఇలాంటి ఆధునిక చికిత్సల కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు భద్రాచలంలోనే అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని రోగి కుటుంబ సభ్యులు తెలిపారు. దీనివల్ల ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చులు, ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని వారు పేర్కొన్నారు. హైద్రాబాద్‌లో అయ్యే ఖర్చులో సగం «ఫీజుకే భద్రాచలంలో పూర్తి కావడంతో ఎంతో సంతోషంగా ఉందని రోగి బంధువులు రాఘవ పేర్కొన్నారు.



## గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలి



**భద్రాచలం టౌన్ , మే 24 ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగే గిరిజన దర్బార్‌కు అధికారులంతా సకాలంలో హాజరు కావాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ తెలిపారు. అలాగే గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని కోరారు. ఉదయం 10.30 గంటల వరకు అధికారుల సమావేశ మందిరంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

## దుగినేపల్లి శివాలయం వద్ద అగ్ని ప్రమాదం






**పినపాక, మే 24 (ప్రజాజ్యోతి)** పినపాక మండలం దుగినేపల్లి గ్రామంలోని శివాలయం సమీపంలో తాటి చెట్లకు అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై నీరు, కొమ్మల సహాయంతో అగ్నిని అదుపు చేసే ప్రయత్నాలు చేపట్టారు. గాలులు వీయడంతో మంటలు మరింత వ్యాపించే అవకాశం ఉండటంతో గ్రామస్తులు అప్రమత్తంగా వ్యవహరించారు. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ కిరణ్, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## చిన్న వయసులోనే చెస్ బరిలో చతురత చాటిన భట్టు జై

- జిల్లా స్థాయి పోటీల్లో నాలుగో స్థానం.





**పాల్వంచ, మే 24, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి చెస్ పోటీల్లో పాల్వంచకు చెందిన చిన్నారి భట్టు జై ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "భద్రాద్రి కొత్తగూడెం చెస్ ఛాంపియన్ షిప్–2026" లో అండర్–9 విభాగంలో పాల్గొన్న జై నాలుగో స్థానం సాధించి తన మేధస్సును చాటాడు.చిన్న వయసులోనే చెస్ పై ఆసక్తి పెంచుకున్న భట్టు జై, ఏకాగ్రత, తెలివితేటలు, సహనం, వ్యూహాత్మక ఆలోచనతో పోటీల్లో ప్రత్యేక గుర్తింపు పొందాడు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన జైకు త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేశారు.చెస్ ఆర్గనైజర్ గోపీ కృష్ణ, స్టేట్ చెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు జ్యోత్స్న చిన్నారిని అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రస్తుతం నవభారత్ పబ్లిక్ స్కూల్ లో నాలు గో తరగతి చదువుతున్న భట్టు జై విజయానికి కోచ్ అన్వర్ అలీ అందించిన శిక్షణ, మార్గదర్శకం ఎంతో దోహదపడిందని తల్లిదండ్రులు చందు భట్టు, స్రవంతి ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

## మార్నింగ్ వాక్ విత్ మేయర్

- సోములగూడం పార్కులో వాకర్స్‌తో కలిసి నడిచిన మేయర్.



**పాల్వంచ, మే 24, ప్రజాజ్యోతి:** ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించాలనే లక్ష్యంతో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఆదివారం ఉదయం పాల్వంచ పట్టణంలోని సోములగూడం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో కలిసి నడుస్తూ వారితో ఆత్మీయంగా మాట్లాడారు. స్థానికంగా ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఉదయం నడక, వ్యాయామం, ఫిట్‌నెస్ వంటి మంచి అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు ప్రతి పార్కులో నిర్వహిస్తే ప్రజల్లో మరింత చైతన్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న తరుణంలో రోజులో కొంత సమయాన్ని ఆరోగ్యానికి కేటాయించడం అవసరమని తెలిపారు. వాకింగ్, వ్యాయామం వంటి అలవాట్లు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకుని వాకర్స్‌గా మారాలని పిలుపునిస్తూ కార్యక్రమం ముగిసింది.

# పాల్వంచలో తాగునీటి పైప్‌లైన్ లీకేజ్

- పరిశీలించిన మేయర్ మూడ్ గణేష్.
- సాయంత్రంలోగా మరమ్మత్తులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు.



**పాల్వంచ, మే 24, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్ లీకేజ్ కారణంగా గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ సోమవారం ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.లీకేజ్ జరిగిన ప్రాంతానికి సంబంధిత అధికారులను యుద్ధ ప్రాతిపదికన పిలిపించిన మేయర్, సమస్య పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మరమ్మత్తు పనులను ఈరోజు సాయంత్రంలోగా పూర్తి చేసి, రేపటి ఉదయం నుంచే పాల్వంచ పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా నిరంతరంగా అందేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మేయర్ సూచించారు.

## పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సన్మానం చేసిన ఇబ్రహీమ్



**ఇల్లందు, మే 24, ప్రజాజ్యోతి:** ఇటీవల సుడా చైర్మన్ గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అభినందన సభ ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ లో జరిగింది. ఈ అభినందన సభలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహమ్మద్ ఇబ్రహీమ్ హాజరు శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత గుర్తింపు ఇస్తుందని ఇబ్రహీమ్ పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వ్యక్తి దుర్గాప్రసాద్ అని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత వారికి సరైన గుర్తింపు ఇవ్వడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎల్ ఎస్ ఎన్ ఓబీ కార్మికుల ఈ పీ ఎఫ్ డబ్బులను వారి ఖాతాలో జమ చేయాలి



**టేకులపల్లి, మే24, ప్రజాజ్యోతి :** ఎల్ఎస్ఎన్ ఓబిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఈపీఎఫ్ డబ్బులను వారి ఖాతాలో జమ చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వహిస్తుందని విషయంపై ఆదివారం కేఓసి పిఓ గోవిందరావు కి కార్మికుల ఈపీఎఫ్ గురించి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు తమ వేతనము నుండి ఈపీఎఫ్ ఎల్ఎస్ఎన్ యాజమాన్యం కోత విధిస్తూ వారి ఖాతాలో గత కొన్ని నెలలుగా జమ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ కార్మికుల జీతాన్ని పరోక్షంగా వినియోగించుకుంటుందని వారు ఆరోపించారు. సంబంధిత ఉన్నత అధికారులకు విన్నపించుకున్నామని యాజమాన్యం వైఖరిలో మార్పు లేదని వారు అన్నారు.ఈపీఎఫ్ డబ్బులను కార్మికుల ఖాతాలో జమ చేయని ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని వారు తెలియజేశారు. కార్మికుల ఈపీఎఫ్ సమస్యపై సింగరేణి అధికారులు చొరవ చూపిజమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.టెండర్ కాల పరిమితి ఒక నెల కాలం మాత్రమే ఉన్నదని కార్మికులకు రావలసిన ఈపీఎఫ్ బకాయిలను తక్షణమే ఎల్ఎస్ఎన్ యాజమాన్యం చెల్లించే విధంగా అధికారులుచర్యలు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి



**టేకులపల్లి,మే24, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు గుగులోత్ రాంచందర్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామ్ చందర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతంగ పోరాట యోధుడు సిపిఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శిగా,మాజీ రాజ్యసభ సభ్యుడిగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకుడుగా ఎన్నో పోరాటాలు చేసి విద్యార్థి యువజన కార్మిక కర్షక మహిళ సంఘాలను నిర్మించి ప్రజాసంఘాల ద్వారా రైతుల కొరకు ఎన్నో పోరాటాలు చేసి ముందుండి నడిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో చింత కనకరాజు, నరేష్, రాంబాబు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, యువరాజు, సోనీ,అరుణ, దేవక్క, విజయశాంతి, మణి,భాను, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలి

- తుపాకుల నాగేశ్వరరావు



**టేకులపల్లి,మే24, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల జనరల్ బాడీ సమావేశం భూక్యా నర్సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.అఖిలభారత రైతుకూలీ సంఘం జెండాను బద్దు తండా మాజీ సర్పంచ్ భూక్యా కీర్యా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏ ఐ కె యం ఎస్)జిల్లా అధ్యక్షులు తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్ని,మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను దగా చేస్తున్నాయని రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం రైతులకు సరిపడా ఎరువులను తక్కువ ధరలకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు రైతు లేనిదే రాజ్యం లేదని పాలకులు గొప్పగా చెప్పుకుంటారని కానీ రైతులకు 100% సబ్సిడీ ఇవ్వడంలో పాలకులు విఫలమవుతున్నారని అన్నారు పంటలకు గిట్టుబాటు ధర లేక రైతాంగం ప్రతి సంవత్సరం ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగం సమరశీల పోరాటలు నిర్వహించి పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భూక్యా. హర్జ, భూక్య. నర్సింగ్,భూక్యా కీర్యా, మేకల. పొట్టయ్య,ఎట్టి. నరసింహారావు,కల్తీ. వెంకటేశ్వర్లు,గుగులోత్. రామచంద్,ధరావత్. బికియా,కోడెం.రవి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్, కల్తీ.స్వామి, మూతి బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిపోయిన ఫోర్‌వే పనులు ...

# నరకయాతన అనుభవిస్తున్న ప్రజలు

- 20 రోజులుగా నిలిచిపోయిన పనులు పెరుగుతున్న ప్రజల ఇబ్బందులు
- దుమ్ము ధూళి, కంకర రాళ్లతో ప్రమాదాల భయం
- అధికారులు స్పందించాలని గ్రామ ప్రజల డిమాండ్



**అన్నపురెడ్డిపల్లి, మే 24, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ఫోర్‌వే రోడ్డు నిర్మాణ పనులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే 4వ తేదీ నుంచి పనులు దాదాపు నిలిచిపోయి 20 రోజులకు పైగా గడిచినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మధ్య మధ్యలో కొద్దిపాటి వాటరింగ్ చేయడం తప్ప నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని చెబుతున్నారు.రోడ్డుపై వేసిన కంకర కారణంగా లారీలు, ఇతర వాహనాలు వేగంగా వెళ్లే సమయంలో రాళ్లు ఎగిసి ఇరువైపులా ఉన్న ప్రజలపై తగులుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కారణంగా ఇప్పటికే చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకున్నాయని చెబుతున్నారు. రోడ్డు పక్కన నడిచే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.రోడ్డు పనుల సమయంలో సరిపడా నీరు చల్లకపోవడం వల్ల ఎగిసిపడుతున్న దుమ్ము ధూళి సమీప ఇళ్లలోకి చేరి ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా రోడ్డు పక్కన నివసించే కుటుంబాలు శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు మరియు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో దుమ్ము ధూళి మరింత ఎక్కువగా ఉండటంతో బయటకు రావడానికే ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది.పనులు ఒకవైపు మాత్రమే మట్టి పోసి వదిలేయడంతో మరోవైపు రహదారి అసౌకర్యంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాలు కురిస్తే గుంతల్లో నీరు నిలిచి ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డ్రైనేజీ సౌకర్యం లేక కొంతమంది ఇళ్ల వద్ద నీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనలను కూడా గ్రామ ప్రజలు గుర్తు చేస్తున్నారు.రోడ్డు పనులు నిలిచిపోయినా రాత్రి వేళల్లో సరైన లైటింగ్ లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేదా ప్రమాద సూచనలు ఏర్పాటు చేయకపోవడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోంది. ఈ పరిస్థితికి గుత్తేదారులా, సంబంధిత అధికారులా లేక ప్రజాప్రతినిధులా బాధ్యత వహించాలనే ప్రశ్న గ్రామంలో చర్చనీయాంశంగా మా రింది.ఇలాగే నిర్లక్ష్యం కొనసాగితే రో డ్డు బ్లాక్ చేసి ధర్నా చేపట్టాలన్న ఆలోచనలు కూడా గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయని తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి నిలిచిపోయిన పనులను వెంట నే ప్రా రంభించడంతో పాటు దుమ్ము ధూళి నియంత్రణ, భద్రతా చర్యలు, డ్రైనేజీ మరియు లైటింగ్ ఏర్పాటుపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# రైతుల భూముల చుట్టూ అక్రమ ప్రహరీ..?

(మొదటి పేజీ తరువాయి...)

తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలంద విద్యాసంస్థల అధినేత మేదరమెట్ల వెంకట చౌదరి కుటుంబ సభ్యులు తమ పలుకుబడి ఉపయోగించి దశాబ్దాలుగా ప్రజలు వినియోగిస్తున్న రహదారిని ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దశాబద్దాల ఏళ్లకు పైగా రైతులు, కూలీలు, స్థానిక ప్రజలు వినియోగిస్తున్న మార్గాన్ని ఏమ్. వి చౌదరి కుటుంబానికే చెందినట్లు చూపిస్తూ రోడ్డు మార్గాన్ని మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రహరీ నిర్మాణం పూర్తయితే రైతులు తమ సాగు భూములకు వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోతుందని దీంతో రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా మల్లు జ్యోతి బాసు, మంకెన సుభాష్ ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణం కొనసాగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే చింత రమేష్ అనే రైతు సాగు భూమి చుట్టూ నిర్మాణం పనులు పూర్తి అవుతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన రైతులను సోదరులు ఇద్దరు బెదిరింపులకు గురి చేస్తు భయాందోళనలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రైతులు పోలీసు శాఖను ఆశ్రయించగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### »» రోడ్డు ఎవరిదో ఎమ్మార్వో తేల్చాలి : ఎస్సై రమణారెడ్డి

విషయం తెలుసుకున్న లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు సూచనలు చేశారు. రహదారి ప్రభుత్వానికి చెందిందా వ్యక్తిగత భూమా అనే అంశాన్ని మండల రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించి స్పష్టత ఇస్తారని సూచించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కూడా రోడ్డు మార్గంపై పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. సమస్యను చట్టపరంగా పరిష్కరించుకోవాలని ఎవరూ గొడవలకు దారితీయొద్దని ఇరు



వర్గాలను హెచ్చరించారు.

### »» భూ సర్వే చేస్తే అసలు నిజాలు బయట పడతాయి : స్థానిక రైతుల డిమాండ్

హమాలీ కాలనీ, సంజయ్ నగర్ గ్రామ పంచాయతీల పరిధిలోని సర్వే నంబర్లు 14, 15, 17, 131 నుంచి 136ఈ/1, 136ఈ/2 వరకు ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రైతులు పేర్కొన్నారు. ధరణి రికార్డుల ప్రకారం అక్కడ రోడ్డు మార్గం నమోదై ఉందని దానిని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇక్కడ గిరిజనుల భూములతో పాటు అటవీ భూములపై కూడా అక్రమాలు జరిగాయని నకిలీ పత్రాలతో భూముల స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఫారెస్ట్ భూములను వెంచర్లుగా మార్చి కొందరు బడా బాబులు విక్రయించారనే ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. స్థానిక రైతులను ఇబ్బందులకు గురిచేసి భూములపై ఆధిపత్యం సాధించాలనే ఉద్దేశంతోనే రహదారి మార్గాన్ని మూసివేస్తున్నారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల రైతుల డాక్యుమెంట్లు, మేదరమెట్ల వెంకట చౌదరి కుటుంబ సభ్యుల భూముల రికార్డులను ప్రత్యేక కమిటీతో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. భూ సర్వే నిర్వహించకుంటే కోర్టు మెట్లు ఎక్కేందుకు కూడా వెనకాడబోమని రైతులు హెచ్చరించారు. గిరిజనులకు హక్కులు ఉన్నటువంటి ఫారెస్ట్ భూములను అప్పటి ఫారెస్ట్ అధికారులు సాగు భూములను. స్వాధీనం చేసుకున్నారని అవే భూములు అగ్ర వర్ణాల చేతిలో ఎలా వచ్చాయో తెలియాలన్నారు. అధికారులు రైతులపై దయతో కబ్జాకీ గురౌతున్న రోడ్డు మార్గాన్ని విడిపించాలని కోరారు.



### »» జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ రైతుల విజ్ఞప్తి

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి స్థాయి భూ సర్వే నిర్వహించాలని ప్రజలకు ఉపయోగపడుతున్న రహదారిని కాపాడాలని రైతులు కోరుతున్నారు. సాగు భూములకు వెళ్లే మార్గం మూసివేస్తే రైతుల జీవనాధారమే ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని రైతు కుటుంబాలు హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా ఆదివాసి వేడుక

- పెద్దకొర్రాజుల స్వామి, పెద్దమ్మ తల్లిని ఇలవేల్పుగా కొలుస్తున్న ఆదిమ తెగ
- వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఆచారం
- ఆధునికత పెరుగుతున్న సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకుంటున్న నాయకపోడు ప్రజలు
- గట్టుగూడెం గ్రామంలో ముగిసిన పెద్దకొర్రాజులు స్వామి, పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు



**అశ్వారావుపేట /దమ్మపేట, మే 24, ప్రజాజ్యోతి :** ఆధునికత వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలోనూ తమ సాంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటూ ఆదివాసి తెగలు ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామంలో నాయకపోడు ఆదివాసి ప్రజలు నిర్వహించిన పెద్దకొర్రాజుల స్వామి, పెద్దమ్మతల్లి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆచారాన్ని నాయకపోడు తెగ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తమ ఇలవేల్పు దేవతలైన పెద్దకొర్రాజుల స్వామి, పెద్దమ్మతల్లిని ప్రత్యేక పూజలతో కొలిచి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసి కుటుంబాలు తరలివచ్చి సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో సందడి చేశారు. ఉత్సవాల సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనగా, యువత గిరిజన కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. జాతర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. పెద్దలు, యువత కలిసి తమ పూర్వీకుల సంప్రదాయాలను తదుపరి తరాలకు అందించాలనే సంకల్పంతో వేడుకలను నిర్వహించారు. నాయకపోడు తెగ సంస్కృతి, ఆచార వ్యవహారాలు నేటికీ జీవించి ఉండటానికి జాతరలే కారణమని గ్రామ పెద్దలు తెలిపారు

### »» స్వామికి పుట్టమట్టి (బంగారం) తో పాన్పు

ఆదివాసి గిరిజన నాయక పోడు జాతి యొక్క ఆరాధ్య దైవాలు శ్రీ కుర్రాజుల స్వామి,పెద్దమ్మ తల్లులను పూజించే ఈ జాతర నాయకపోడు గ్రామాలలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారు పెద్ద కుర్రాజుల స్వామి వారికి ఆడబిడ్డగా శ్రీ పెద్దమ్మతల్లిని, పోతురాజులతో కలిసి తీసుకొస్తారు. అడవిలో ఉన్న పుట్ట దగ్గరకు గ్రామంలో ఉన్న మహిళలు నీటి బిందెలతో వెళ్లి పుట్టను మొత్తం శుద్ధి చేసి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమట్టి (బంగారం) తీసుకుని వచ్చి కొర్రాజులస్వామి గుడిలో మట్టితో పాన్పు వేసి స్వామివారితో పాటు పెద్దమ్మతల్లిని పోతురాజులను ప్రతిష్టించడంతో జాతర ప్రారంభమవుతుంది. గ్రామంలోని ప్రతి ఇంటికి, గ్రామ సరిహద్దులకు మామిడి వేప ఆకులతో తోరణాలు కడతారు. గ్రామంలో స్వామి వారిని ప్రతి వీధిలో ఊరేగిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. చివరి మూడు రోజులు ఈ ఉత్సవం ఎంతో కనుల పండుగ జరుగుతుంది. పూజారి ఇంటి వద్ద కొలబియ్యం తర్వాత అదే బియ్యాన్ని గుడి వద్ద తిరిగి కొలవడం వంటి మహిమాన్వితమైన కార్యక్రమాలు ఈ ఉత్సవాలలో జరుగుతాయి. అడవిలోకి వెళ్లి సరువులు తీసుకురావడం గుడి వద్ద పట్నం( ముగ్గు )వేసి దేవుళ్ళతో ఆ ముగ్గులను దాటడం, పూజారులతో పోతురాజులు ఉంచబడిన సమీప చెరువు వద్దకు గ్రామం యావత్తు ఊరేగింపుగా బయలుదేరి వెళ్లడం అక్కడ చెరువులో సాంప్రదాయ బద్ధమైన పూజలు ఈ జాతరలో నిర్వహిస్తారు. అగ్ని గుండాలు తయారు చేయడం, ముందుగా పూజారి అగ్ని గుండం ప్రవేశించడం బద్దె గొర్రెను పొడవడం అనంతరం మిగతా దేవుళ్లను ఎత్తుకున్న భక్తులు భగభగ మండే అగ్నిగుండంలోకి ప్రవేశించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం స్వామివారికి ముత్యాలమ్మ తల్లికి మేకపోతులను బలి ఇచ్చి ఉత్సవానికి ఆహ్వానించిన బంధుమిత్రులతో కలిసి విందులు చేసుకోవడంతో జాతర ముగుస్తుంది.



ఒకప్పుడు "అమ్మ" అనే మాట వినగానే తలవంచే సంస్కృతి... ఇప్పుడు అదే తల్లిని భయంతో వణికించే స్థితికి కొందరు యువకులు దిగజారుతున్నారా...? గంజాయి మత్తు యువత రక్తంలో కలిసిపోతూ... బంధాలు, విలువలు, సంస్కారం అన్నింటినీ కాల్చేస్తోందా...?భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో వెలుగులోకి వచ్చిన ఓ జుగుప్సాకర ఘటన ఇప్పుడు ప్రతి ఇంట్లో చర్చనీయాంశమవుతోంది. "మత్తు వచ్చినవాడికి తల్లి కూడా కనిపించదు" అనే పెద్దల మాటను అక్షరాలా నిజం చేసినట్టుగా చెబుతున్న ఈ సంఘటన... సమాజాన్ని కలవరపెడుతోంది. కన్నతల్లి ఒడిలో పెరిగిన కొడుకే... అదే తల్లిని అసభ్యంగా వేధించాడన్న ఆరోపణలు స్థానికులను కుదిపేశాయి. "చెట్టు వేరు కుళ్లితే కొమ్మలు నిలవవు... యువత మత్తుకు బానిసైతే సమాజం నిలవదు" అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్తు మాయలో మానవత్వమే మంటల్లో కలిసిపోతున్న పాల్వంచ ఘటనపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (భూక్యా రంజిత్ నాయక్), ప్రజా జ్యోతి :

# కన్నతల్లినే కామంతో చూసే కాలమా ఇది...?

**మత్తు మాయలో కన్న తల్లిపై అమానుష వేధింపులు**

- **"అమ్మ" అనే పవిత్ర బంధానికే మచ్చ**
- **పాల్వంచ ఘటనతో ఉలిక్కిపడ్డ సమాజం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని జగన్నాధపురంలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గంజాయి మత్తుకు బానిసైనట్లు స్థానికులు అనుమానిస్తున్న ఓ యువకుడు తన కుటుంబ సభ్యులపైనే అమానుషంగా ప్రవర్తించాడన్న సమాచారం బయటకు రావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

స్థానికుల కథనం ప్రకారం... కొంత కాలంగా మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువకుడు ఇంట్లో తరచూ గొడవలు సృష్టిస్తూ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని తెలుస్తోంది. మత్తులో విచక్షణ కోల్పోయి అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలతో కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు సమాచారం. అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న తన కన్నతల్లిపైనే అసభ్యంగా ప్రవర్తిస్తూ, "నాతో పడుకుంటావా... లేదంటే చంపేస్తా..." అంటూ బెదిరించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన బాధిత మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యారు. వెంటనేఅక్కడికి చేరుకున్నస్థానికులు యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకున్నతల్లి...చివరికి అదే బిడ్డ చేతుల్లో భయంతో వణికిపోయిన దృశ్యం స్థానికులను కలచివేసింది. "పాలు పోసిన చెట్టే నీడివ్వాలి...కానీ అదే చెట్టు ఇంటినే కూల్చేస్తే?" అంటూ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు "అమ్మ" అనే మాట వినగానే గౌరవంతో తలవంచిన సంస్కృతి... ఇప్పుడు మత్తు మాయలో అదే తల్లిని అవమానించే స్థాయికి కొందరు యువకులు దిగజారడం సమాజ పతనానికి సంకేతమని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. "మాతృదేవోభవ" అని చెప్పుకునే భారతీయ సంస్కృతిలో... తల్లినే భయపడే స్థితికి నెట్టే మత్తు మహమ్మారి ఎంత ప్రమాదకరమో ఈ ఘటన చూపించిందని ప్రజలు అంటున్నారు. జిల్లాలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత ఎక్కువగా తిరిగే ప్రాంతాలు, కాలేజీలు, శివారు కాలనీలు, నిర్జన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని కొందరు ముఠాలు గంజాయి సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. "మొదట సరదా... తర్వాత అలవాటు... చివరికి నాశనం" అన్నట్లుగా యువత జీవితాలు చీకటిలోకి జారిపోతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. "చదువులు చదవాల్సిన చేతుల్లో ఇప్పుడు గంజాయి చుట్టలు కనిపిస్తున్నాయి. కుటుంబాలను నిలబెట్టాల్సిన యువతే... ఇప్పుడు కుటుంబాలకు భయంకరంగా మారుతోంది" అంటూ పెద్దలు మండిపడుతున్నారు. ఈ ఘటనతో జిల్లా పోలీస్ శాఖపై కూడా ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. "ప్రతి వీధిలో గంజాయి అందుబాటులో ఉంటే యువత ఎలా కాపాడబడుతుంది?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంజాయి విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని, మత్తు ముఠాలపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని, యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని



డిమాండ్ చేస్తున్నారు. మత్తు మాయలో మానవత్వమే మంటల్లో కాలిపోతోంది" అని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీస్ శాఖ, తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు కలిసి గంజాయి మహమ్మారిపై ఉక్కుపాదం మోపకపోతే... రాబోయే రోజుల్లో మరిన్ని కుటుంబాలు చీకటిలో కలిసిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది

**››› మత్తు పదార్థాలపై కఠిన నిఘా – ప్రజల సహకారం అవసరం : ఆర్ ఎస్ ఐ ఓం ప్రకాష్**



గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తున్నాయని, మత్తుకు బానిసైన వారు కుటుంబాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి

జిల్లాలో గంజాయి విక్రయాలు, రవాణా, సరఫరాపై పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. మత్తు పదార్థాల వ్యాపారంలో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, కుటుంబ విలువలపై దృష్టి పెట్టాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు తమ పరిసరాల్లో గంజాయి విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి

"మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే సమాజం ఆరోగ్యకరమైన దిశగా ముందుకు సాగుతుంది"


**››› మహిళల భద్రత కోసం కఠిన చర్యలు అవసరం : కోట దేవదానం , ప్రముఖ న్యాయవాది**



ఇలాంటి ఘటనలు కేవలం కుటుంబ సమస్యలు మాత్రమే కావు... ఇవి సమాజానికి తీవ్రమైన హెచ్చరిక. మత్తు పదార్థాల ప్రభావంతో మహిళలపై వేధింపులు, గృహ హింస, మానసిక హింస వంటి ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

బాధిత మహిళలకు తక్షణ చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, మత్తు పదార్థాల విక్రయాలు , వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలి. యువతను మత్తు వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు కుటుంబాలు, విద్యాసంస్థలు, పోలీసులు సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది

**››› యువతను కాపాడకపోతే సమాజ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది: తోటమల్ల రమాదేవి, మండల విద్యాశాఖాధికారిని , భద్రాచలం**



పిల్లలకు చిన్నప్పటి నుంచే కుటుంబ విలువలు, మహిళల పట్ల గౌరవం, మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి. ప్రస్తుతం చెడు స్నేహాలు, సోషల్ మీడియా ప్రభావం, మత్తు అలవాట్లు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై నిరంతరం నిఘా పెట్టాలి. పిల్లలతో సమయం గడుపుతూ మంచి–చెడులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబాలపై ఉంది. లేదంటే రాబోయే రోజుల్లో సమాజం మరింత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంది